
# భారతంలో మార్జాల పర్వం

## కల్లూరు రాఘవేంద్రరావు

**రూ. 3,000 ప్రత్యేక బహుమతి పొందిన కథ**



పిల్లికూనవరం ఆంధ్రప్రదేశ్‌లో ఓ చిన్నపల్లె. ఆ ఊళ్లో ఓ పాడుబడిన బంగళా. అందులో పిల్లులన్నీ ఓ రోజు సమావేశమయ్యాయి. గండుపిల్లి బిడాలమయ్య ఆ పిల్లుల రాజ్యానికి ఓ పెద్ద నాయకుడు. ఆయన మాటకు ఎదురేలేదు. ఆయనెప్పుడు, ఎక్కడ సమావేశం కావాలంటే అక్కడ అందరూ కలియాల్సిందే. అది సుగ్రీవుని ఆజ్ఞ కంటే మించింది. నాయకుడు ఆజ్ఞాపించగానే ఓ పిల్ల, దాని మందీమార్బలం అంతా ఆ చుట్టూ వూర్లలో 'మ్యావ్-మ్యావ్' అంటూ తిరుగుతాయి. అదే వాటికి దండోరా. దాంతో అన్ని పిల్లులు తండోపతండాలుగా కూనవరం సభకు కదిలివచ్చాయి.

కథ

గద్దె మీద కూర్చొన్న బిడాలమయ్య మీసాలు చూస్తేనే చాలు, పిల్లులన్నింటికి హడల్. ఆ నాయకుడొక్కసారి కండువా ఝళిపిస్తే చాలు కొండలా వున్న పెద్ద పందికొక్కు కూడ ఆ పిడుగులాంటి శబ్దానికి గజగజ వణికిపోవాల్సిందే!


రాష్ట్ర ఆఖుభుక్కు సంఘానికి మార్జాలేశ్వర రావ్ కార్యదర్శి. బిడాలమయ్య అధ్యక్షతన జరుగుతున్న ఆ సభలో కార్యదర్శి వేదిక మీదున్న అందరికీ పేరుపేరున వందనాలు అర్పిస్తూ తన ప్రసంగాన్ని మొదలుపెట్టాడు. ''నాతోడి సోదర సోదరీమణులైన మార్జాల సేనకు ఇవే నా స్వాగతాంజలులు. ఈ రోజు మనం ఈ మానవసంఘం మధ్యన అతిహీనాతిహీనంగా మనుగడ సాగిస్తున్నామని చెప్పడానికి చాలా విచారిస్తున్నాను. భూలోకంలో మానవులతో సహజీవనం చేస్తున్న ప్రాణులన్నింటిలోకి మనం చాలా ఉత్తమమైన ప్రాణులం. ఏ ప్రాణికి లేని చొరవ మనకు వాళ్ల ఇండ్లల్లో వుంది. మనం వాళ్ల నివాసాలలోని ఎలుకల్ని భక్షించి వారికెంతో ఆరోగ్యాన్ని కలిగిస్తూ, వాటివల్ల వస్తున్న నష్టాలనెన్నింటినో నివారిస్తున్నాం. అయినా ఆ మనుషులు మనల్ని కనీసం పాలు కూడా తాగనీయకుండా చేస్తున్నారు. మనకందవలసిన పాలు, పెరుగు, వెన్న, నేయి, చేపలు, ఇతర ఆహారపదార్థాలు కూడ అదేదో..'' అంటూ నసుగుతూ వుంటే పక్కలోనే వున్న సహాయ కార్యదర్శి శ్రీ ఓతువు 'ఫ్రిజ్...ఫ్రిజ్' అంటూ రెండుసార్లు ప్రాంటింగ్ ఇచ్చాడు. దాంతో ''...అవును, అది నాకు తెలుసు. అయినా ఆ ఆంగ్లపదాన్ని నేనుచ్చరించదలుచుకోలేదు. తెనుగుగడ్డపై పుట్టి, తెనుగు భాషా వికాసానికి నడుం కట్టి, వేయేండ్ల తెనుగు భాషకు జాతీయ గుర్తింపు తేవాలని అహోరాత్రులు కృషిచేస్తున్న మాకు ఆ పదం ఉచ్చరించడం ఇష్టం లేదు. దాన్ని నేను 'చలిది పేటిక'గా వ్యవహరిస్తున్నాను. అందులో అన్నీ వుంచేసి కనీసం ఓ బొట్టు కూడ మనకందకుండా చేస్తున్నారు. ఇది చాలా అన్యాయం. మన జాతికి మానవులు చేస్తున్న ఘోరమైన ద్రోహమిది. దీన్ని నేను ఖండిస్తున్నాను'' అని అనగానే సభలో పిల్లులన్నీ ఆనందంతో కరతాళధ్వనులు చేస్తు, ఈలలు వేస్తు ఎగిరిగంతులేసాయి. ''అవును..అవును'' అంటూ అరిచాయి.

ఆ మాటలకు అధ్యక్షుడు బిడాలమయ్య పొంగిపోతూ, మధ్యలోనే లేచి, ''అంతేకాదు..మనం రేయల్లా నిద్రకాచి వేటాడి ఎలుకల్ని చంపి, ఉదయం కాస్త వెచ్చగా ఉండేచోట కునుకు తీద్దామనుకుంటే... అసలు వాళ్ల ఇళ్లల్లో పొయ్యిలే ఉండడం లేదు. కనీసం స్నానపు గదుల్లో కూడ మనకు ఆ సౌకర్యం లభించడం లేదు. అవేవో..'' అంటుండగానే సహాయకార్యదర్శి ''గ్యాస్‌స్టావ్‌లు..గ్యాస్ స్టావ్‌లు'' అని కేకేసాడు. దాంతో అధ్యక్షులవారికి కోపం వచ్చి, ''ఏమిటా పరభాషా పదప్రయోగాలు. స్వచ్ఛమైన తెలుగులో చెప్పలేవా? అందుకే అన్నాను,ఆంగ్లపాఠశాలలో చదివిన కుర్రకుంకలను మన కార్యవర్గంలో చేర్చుకోవద్దని.. అయినా వింటే కదా! తెలుగులో ఆ మాట చెబితే నేను సంతోషిస్తాను'' అన్నారు బిడాలమయ్యగారు కోపంగా.

వెంటనే స.కార్యదర్శి శ్రీ ఓతువు గట్టిగా ''వాయుజ్వలిత పొయ్యి'' అన్నాడు.అందుకు కోపగించుకున్న బిడాలమయ్య ''నీ తెనుగు పాడుకాను. దాన్ని 'సహజ వాయుజ్వలిత పొయ్యి' అనాలి. తెలిసిందా!'' అని కోపంగా గర్జించాడు. దాంతో అందరూ పెద్దాయన చేసిన పదప్రయోగమే సరియైందని చప్పట్లు చరిచారు.

దాంతో స.కార్యదర్శి మూతిముడుస్తూ ''పీఠమెక్కిన పెద్దలు ఏంచెబితే అదంతా శుద్ధ తెనుగే అవుతుంది మరి'' అంటూ గొణుక్కున్నాడు కోపంగా.

అంతరాయం తరువాత అధ్యక్షులవారు తమ ఉపన్యాసాన్ని కొనసాగిస్తూ''... కనీసం ఒక్క పూరి గుడిసెలో కూడ పాతపద్ధతిలో వండే విధానం లేకుండాపోయింది. ఈ లోటువల్ల మన బాలింతలు, పసికూనలు, శీతల జ్వరాలకు లోనై మరణించడం కూడ చాలా చోట్ల సంభవించింది. అది మా దృష్టికి వచ్చింది...'' అంటూ అధ్యక్షులవారు మాతా శిశు సంరక్షణ శాఖా సహాయకురాలైన సీబిల్లి సీతాలు వంక చూశారు. సీబిల్లి సీతాలు లేచి,''అవును..అవును..ముమ్మాటికి ఇది నిజం. నావద్ద లెక్కలున్నాయి. సభకు సమర్పించమంటే సమర్పిస్తాను. ఈ మధ్య మన పిల్లల్ని మానవ ఆస్పత్రుల్లో కాని, జంతువైద్యశాలల్లో కాని చేర్చుకోవడం లేదు. అందుకు కారణం..'మనుషుల పిల్లల ప్రాణాలకే హామీ ఇవ్వలేం..మీ పిల్లులకేం హామి ఇస్తాం' అంటూ డాక్టర్లు..తప్పు..తప్పు వైద్యులు అంటున్నారు. ఈ మానవజాతి మనకు చేస్తున్న



తీరని ద్రోహాల్లో ఇదొకటి'' అంటూ ఆవేశంగా లేచి మాట్లాడింది. అందుకు బిడాలమయ్య ''అవును ఈ మధ్య ఇరవై ఐదు మంది దాకా పిల్లలు ప్రభుత్వ వైద్యశాలలో ఓ నాలుగురోజుల్లోనే వైద్యుల నిర్లక్ష్యం వల్ల చచ్చినట్లుగా వార్తలు విన్నాను. ఆ శాస్తి వాళ్లకు జరగాల్సిందే..'' అంటూ పండ్లు పట పటమని కొరికాడు.

ఇంతలో సహాయకార్యదర్శి శ్రీ ఓతువు లేచి, ''శ్రీమార్జాల నాయకాగ్రణీ! మీ ముందు మరికొన్ని ముఖ్యమైన విషయాలు ఉంచాలనే తపనతో నేను లేచాను. పొరబాటుగా ప్రసంగం మధ్యలో ఏవైనా ఆంగ్లపదాలు దొర్లితే క్షంతవ్యుణ్ణి. ఈ మానవులు కృతఘ్నులు. వీరికి మనం సేవచేయడం వృథా. వీరికి మనజాతి మీద గౌరవం లేదు. మనల్ని, మన జాతిని ఎప్పుడూ ఏదో ఒక పనికిమాలిన సామెతతో, వ్యంగ్యోక్తితో ఎగతాళి చేస్తూ ఉంటారు. నిన్న గాక మొన్న నేను విన్న ఓ మాట.'వీడినెందుకు వెంటబెట్టుకొచ్చావ్?..పిల్లిని చంకబెట్టుకొచ్చినట్లు' అని ఆక్షేపించాడొకడు, మరొకణ్ణి చూపిస్తూ. వాడు పనికిమాలిన వాడు కావచ్చునేమో గాని, మనం పనికిమాలిన వాళ్లం కాదు కదా! పొగరు కాకపోతే మనల్ని పోలుస్తూ ఆ మాట అనడమమేమిటి? మరో ప్రాణి కనిపించలేదా వీడికి.

ఇంకో విషయానికొద్దాం. ప్రయాణమవుతున్న మనిషికి మనం పొరబాటున ఎదురైతే వాడెంత చీదరించుకుంటాడో తెలుసా! అంతేకాదు నానా తిట్లు తిట్టి, దాన్నో పెద్ద అపశకునంగా భావించి ప్రయాణమే మానుకుని ఇంటికి తిరిగిపోతాడు. ఏం, మేమంత పనికిమాలినవాళ్లమా! అదే ఏ కుక్కో, గాడిదో, తుదకు పందొచ్చినా పరవాలేదు వాడికి. మేం మాత్రం ఎదురురాకూడదంటాడు. భడవ.. ఏం మనిషి వీడు. వీడి భూతదయ చచ్చినట్లే వుంది. పిల్లికి కూడ భిక్షంపెట్టని పిసినారి నాయాళ్లు వీళ్లు. వీళ్లా మనల్ని అపేక్షించింది. పశువులకంటే హీనంగా జీవిస్తున్న ఈ మనుష్యులకు మనం గుణపాఠం తప్పక నేర్పాల్సిందే! వీళ్లు మన పాలిటి శత్రువులు..'' అంటూ స.కార్యదర్శి ఇంకా తన ప్రసంగాన్ని ముగించకముందే ...వృషదంశక బిరుదాంకితులు, అభ్యుదయకవి, నవయుగ కవితా వైతాళిక శేఖరుడైన బిడాలశ్రీగారు లేచి ప్రసంగిస్తూ,

''సభకు వందనాలు. మానవులు మన పాలిటి శత్రువులని ఉద్ఘాటించిన ఆ వక్తను నేనెంతగానో ప్రశంసిస్తున్నాను. ఎందుకంటే.. అందుకు తార్కాణాలు లేకపోలేదు. తొలుతగా మనం విజయనగర సామ్రాజ్యాధీశుడైన శ్రీకృష్ణదేవరాయల వారి కాలాన్నే ఉదాహరణగా తీసుకుందాం. ఆ కాలంలో రాయలు మన జాతిని అభివృద్ధి పరచాలనే సంకల్పంతో ప్రజల్ని పిలిచి, తలా ఒకొక్కరికి ఓ ఆవు, మన జాతి పసికూనల్ని ఇచ్చి, వీటికి మంచిగా ఆవు పాలుపోసి బలిష్ఠమైన జాతిగా తీర్చండి, ఎవరి పిల్లి బలిష్ఠంగా వుంటుందో వాళ్లకు గొప్ప బహుమానం ఇస్తానని సభలో ప్రకటిస్తే ఓ ప్రబుద్ధుడు, కొంటెకవి, సమయానుకూలంగా నామాలు మార్చుకునే వికటకవి తానూ ఓ పిల్లికూనను పెంచుతానని తీసుకెళ్లి..దానికి రోజు వేడిపాలు పెట్టి, నాలుక కాల్చి, ఆకలితో నకనకలాడేలా దాన్ని చంపిన సంగతి తెలియనిదికాదు. తమ పిల్లలకి మాత్రం ఆ ఆవుపాలు ఇచ్చి వాళ్లను దున్నపోతులుగా మార్చిన మోసపూరిత మనుషులు వీరు. ఇది ద్రోహం కాదా? యోగ్యులు, విజ్ఞులు, కవీశ్వరులైన మానవులే ఈ విధంగా మనపట్ల శత్రుత్వాన్ని వహించి, స్వార్థాన్ని పెంచుకుని మనకు అన్యాయం చేసినప్పుడు, మనం వాళ్లనెందుకు గౌరవించాలి. వజ్రాన్ని వజ్రంతోనే కోయాలి. ముల్లును ముల్లుతోనే తీయాలి. శత్రువును శత్రువుతోనే మట్టుపెట్టించాలి. ఇదే మన లక్ష్యం. ఇదే మన ధ్యేయం. ఆలోచించండి..పిల్లుల్లారా! పదండి ముందుకు.. పదండి తీసుకు, దూసుకుపోదాం మానవజాతి పైపైకి..'' అంటూ ఆవేశంగా ఊగిపోతూ ప్రబోధ గీతాన్ని ఆలాపించాడు బిడాలశ్రీ, జారిపోతున్న కండువాను సరిచేసుకుంటూ.

కవీశ్వరుల మాటకు సభలో చప్పట్లు మారుమోగాయి. సభలోని పిల్లుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. కొందరు యువనాయక కిశోరులు వివిధరకాలైన హర్షధ్వానాలు చేశారు. కొందరు హుషారుగా పక్కవారి వీపులు చరిచారు. కొందరు ఆనందం పట్టలేక ఒకరి ఒళ్లు ఒకరు నొక్కుకున్నారు.


ఇంతలో మార్జాల మాతృశ్రీ లేచి, ''సభాధ్యక్షా! మానవులెంతవారంటే తమ అధికారబలం సాగుతుంది కదా! అని పరస్త్రీలను తమ స్త్రీలుగా చెప్పుకుని పరదేశాలకు ఎగుమతి చేసి డబ్బు కోట్లల్లో గడించేస్తున్నారు. లంచగొండితనాన్ని ప్రోత్సహిస్తున్నారు. అధికారాన్ని చేజిక్కించుకుని రాజ్యాంగాన్నే తలకిందులు చేస్తున్నారు. వీరికి తగిన బుద్ధి చెప్పాల్సిందే! మీ ఉపన్యాసాన్ని కొనసాగించండి..'' అంటూ ఎలుగెత్తి చాటింది. అందరూ ఆవిడ ధైర్యానికి 'శభాష్' అన్నారు. స్త్రీలు సహితం ఇలాంటి సభల్లో పాల్గొనడం సభకు ఉత్తేజాన్నిచ్చింది.

ఇంతలో బ్రహ్మజ్ఞాని, తత్త్వవేత్త, వేదాంత దేశిక శిఖామణులైన శ్రీ అచల సద్గురు పునుగుపిల్లి స్వామి వారు లేచి, అందరిని ఆశీర్వదిస్తూ, ''ఓం.. గురుభ్యోనమః సకల మార్జాల లోకానికి ఆశీస్సులు. క్రితం ఉపన్యసించిన కవీశ్వరుల మాటలు ఎలా వున్నాయంటే– 'పిల్లి శాపానికి ఉట్లు తెగుతాయా?' అనే విధంగా వుంది. అంత లేనిదే మనుషులు మనకా సామెతను అంటగట్టారా! చెప్పండి. శత్రువును శత్రువుతోనే నశింపచేయాలనడం ఎలా వుందంటే..'పిల్లికి జ్వరమొచ్చేమాటల్లా' వున్నాయే తప్ప వేరులేదు.

మానవుడు రానురాను మనకు పూర్తిగా శత్రువై పోతున్నాడన్నది సత్యం. దాన్ని అందరూ ఒప్పుకుంటున్న విషయమే. ఆ విషయాన్ని చర్చించడం వదిలి, శాసనసభల్లో కాలం వృథా చేస్తూ, మాటలను సాగదీస్తూ, ఒకరినొకరు దెప్పిపొడుచుకునే మానవ నాయకుల్లా ప్రవర్తించడం మన విజ్ఞతకు తగదు. అందుకే నేను సూటిగా అసలు విషయాని కొస్తున్నాను.

మనం జన్మతహా పెద్దగా ధైర్యం చాలని వాళ్లం– అన్నది అక్షరాల సత్యం. పోనీ, మనకు ఇతరుల అండేదైనా ఉందా అంటే అదీ లేకపోయే. మనకే దేవుడి అండాలేదు. ఏ దేవుడికీ మనం వాహనం కూడా కాకపోతిమి. మనకంటే ఆ దున్నపోతు నయం. ఓ దేవుణ్ణి మోస్తుంది. ఆ దేవుడు దాన్ని కష్టాల్లో ఆదుకుంటాడు. ఆ అవకాశం కూడ మనకు లేదే– మనమూ స్వతహాగానే స్వశక్తిలేని వాళ్లం. ఆ మానవులా– ఎప్పుడూ మారణాయుధాలు ధరించే వుంటారు. వాళ్లకు తెలిసినన్ని కుట్రలు కుతంత్రాలు, రాజకీయపుటెత్తులు, పార్టీల అండదండలు మనకెక్కడున్నాయి చెప్పండి..వాళ్లు తిమ్మిని బమ్మిగా, బమ్మిని తిమ్మిగా చేయగల సమర్థులు. వాళ్లకు గల్లీ నుంచి ఢిల్లీ వరకు సత్సంబంధాలున్నాయి. వాళ్లను జయించడం మన తరం కాదు. బాగా ఆలోచించి అడుగు ముందుకు వేయండి'' అంటూ ఆ కాషాయాంబరధారి సభకు హితోపదేశం చేసి కూర్చున్నాడు. అన్ని పిల్లులు అతని మాటల్లో కూడ సత్యముందని తలూపాయి.

ఇంతలో ఆ సభలోని యువబృందానికి



సన్యాసి చెప్పిన మాటలు రుచించినట్టులేదు. వెంటనే ఆ బృంద యువనాయకుడు కండ్లెర్ర చేసుకుని లేచాడు. గట్టిగా అరిచాడు. చేతులూపుకుంటూ ఆవేశంగా వేదిక దగ్గరికొచ్చాడు. ఆ యువకిశోరం సింహంలా గర్జించాడు. అతని వెనుక వందలమంది జేజేలు పలికారు. అతన్ని చూడగానే సభంతా హర్షధ్వానాలతో మిన్నుముట్టింది. ఎక్కడలేని ఉత్సాహంతో వాళ్లు ''యువకిశోరం వర్ధిల్లాలి- యువనాయకత్వం రాణించాలి. యువచైతన్యం ముందుకు సాగాలి. యువతరానికి అవకాశాలు మెండుగా ఇవ్వాలి'' అంటూ పెద్దగా నినాదాలు చేశారు. సభ ఆ నినాదాలతో ప్రతిధ్వనించింది.

మరికొందరు'' యువ వ్యాఘ్రానువంశీక! జయహో.. జయహో..'' అంటూ శ్లాఘించారు. ఆ యువనాయకుడు ఎవరో కాదు, మన బిడాలమయ్యగారి పుత్ర రత్నమే. ఆ కుమారరత్నం- 'మంచి వక్త. పట్టుదలగలిగిన పులి. రాజకీయంలో జంబుకం. శత్రువుల పాలిట బెబ్బులి' అంటూ కొందరు ఎలుగెత్తి చాటారు. ఆ యువకుడు వేదికనెక్కేంతవరకు కరతాళధ్వనులు ప్రతిధ్వనిస్తూనే వున్నాయి. వేదికనెక్కగానే నాయకుడు చేతులూపుతూ అందరకీ వందనం చేశాడు.

''మహా మార్జాల శేఖరులారా! మీ అభిమానానికి శతకోటి వందనాలు. ఇంతవరకు ప్రసంగించిన పెద్దల మాటలను బట్టి చూస్తే మనం పిరికిపందలమనే అభిప్రాయం వాళ్లల్లో నాటుకుని వుంది. దీన్ని మన యువతరం తుడిచిపెట్టాలి. ఇంతకు మనం ఏ వంశీకులమో ఒకసారి జ్ఞాపకం చేసుకోండి. మనలో ఏ వంశపు రక్తం ప్రవహిస్తుందో ఒకసారి ఆలోచించండి, మీకర్థమవుతుంది అప్పుడు. మనలోని పిరికితనం పారిపోతుంది. పిరికితనం మన ఇంటా వంట కూడ లేదే.. అలాంటి మనల్ని పిరికివాళ్లని ఎలా చెబుతున్నారు మీరు. ఇకపోతే బెదరడం అనేది మన నైజం. అది బెదరడం కాదు, పెద్దల యెడ మనం చూపుతున్న గౌరవభావమది. దాన్ని అలుసుగా తీసుకుని మనం పిరికివాళ్లమంటే సహించేదిలేదు. మనల్ని ఎవరైనా బంధించి భయపెట్టేప్రయత్నం చేస్తే, మనం ఊరుకుంటున్నామా చెప్పండి. వాళ్ల కనుగుడ్లు పీకిపెట్టడం లేదా! వాళ్ల ప్రాణాలు తీయడానికి వాళ్ల ఆయువుపట్టుపైన దాడిచేయడం లేదా! అప్పుడు ఎలా వచ్చింది మనకా ధైర్యం? ఒక్కసారి ఆలోచించండి. అంతే కాని పిరికితనాన్ని నూరిపోయడం కాదు ప్రస్తుత మన కర్తవ్యం. మన శత్రువుపైన ఎలా విజయం సాధించాలనేదే మన ప్రధానకర్తవ్యం. అందుకు తగిన ఆలోచన మా యువతరం చేస్తూనే వుంది. మన కవిగారైన బిడాలశ్రీగారు చెప్పిన మాటల్లో సత్యం లేకపోలేదు. మన శత్రువుల్ని మన శత్రువులతోనే నశింపచేయడమనేది ఒక సరికొత్త ఆలోచన. అందులో ఎంతో నిగూఢమైన రాజకీయం దాగుంది. దాని అర్థం చాలామందికి స్ఫురించకపోవచ్చు. దాన్ని నేను వివరిస్తాను. శ్రద్ధగా చెవులు రిక్కించి వినండి, ఆలోచించండి, అనుసరించండి, మన శత్రువుల్ని తరిమికొట్టండి..'' అనగానే సభలో కరతాళధ్వనులు ఆకాశాన్నంటాయి.

కొందరు పెద్దలు ''ప్రసంగం కొనసాగాలి'' అంటూ తమ కండువాలను గాలిలో వూపారు. అప్పుడు యువనాయకుడు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ,''మీ అభిమానానికి ధన్యవాదాలు. నేటి రాజకీయపుటెత్తులు ఎలా వుంటాయో వృద్ధ మార్జాల పితామహులకు తెలీవు. వారి అభిప్రాయాలు వేరు. అవి ఈ కాలం యువకులకు ఏమాత్రం నచ్చవు. ఈ తరానిదంతా కొత్తపోకడ. బుద్ధిమంతులైన మానవుల ఆలోచనలు కూడా మన ఆలోచనల ముందు బలాదూర్. మన శత్రువులైన మానవులపై మనమే సూటిగా శత్రుత్వాన్ని ప్రకటించలేం. అందుక్కారణం మనం వారికి ఏవిధంగాను హాని తలపెట్టలేము. మన ఆకృత్యాల వల్ల వారికి ఏమాత్రం నష్టం కలుగదు. కారణం వారికి మనమెప్పుడు సన్నిహితంగా ఉండడమే. అందుకే మనం వైరివర్గాన్ని వారిపైకి ఉసిగొల్పాలి. అందుకు మనం మన వైరివర్గాన్ని అంటే మూషికాలను మద్దతు కోరాల్సివుంటుంది'' అని ఇంకా మాట ముగించకముందే, సభలో ప్రతిపక్ష నాయకుడైన తెల్లమీసాల వృద్ధ మార్జాల శేఖరుడు పిల్లి నాయుడు లేచి, ''పిల్లికి చెలగాటం ఎలుకకు ప్రాణ సంకటం'' అన్నట్లుగా వుంది మీ నాయకత్వపు ఆలోచన.. ఎలుకలు మనకు మద్దతు పలుకుతాయా! పనివారి దగ్గరికెళ్లి జోస్యమడిగినట్లుగా వుంది మీ ఆలోచన. మన మాటల్ని అవి వింటాయా? నమ్ముతాయా? ఇదంతా ఒట్టి మాటలగారడీ తప్ప విశ్వసించడం కష్టం'' అంటూ తీవ్రంగా వాదించి కూర్చున్నాడు. ''ఇదీ సమంజసమైన మాటే..'' నంటూ తలూపాయి కొన్ని పిల్లులు.

ఆ ప్రతిపక్ష నాయకుడి మాటలతో యువకిశోరానికి ఎక్కడలేని కోపం వచ్చింది. వెంటనే సమాధానం చెప్పడానికి లేచాడు యువకిశోరుడు. వెంటనే సభలో కరతాళధ్వనులు ప్రతిధ్వనించాయి.

''పిల్లినాయుడు గారు ఎన్నేండ్లు పాలించినా వారికి రాజకీయమంతగా తెలిసినట్టుగా లేదు. వారు పంచతంత్రం గాని, మహాభారతం గాని చదివినట్టులేదు..అసలు విన్నట్టు కూడా లేదు. అది మన దౌర్భాగ్యం. మహాభారతంలో శకుని నూటికి నూరు పాళ్లు కౌరవులకు శత్రువే కదా! అది అందరికీ తెలిసిన విషయమే కదా! అందుకు ఆ అబలుడైన శకుని ఏం చేశాడు? తన శత్రువులైన కౌరవుల్ని కడతేర్చడానికి వారి పక్షానే నమ్మకస్థుడుగా చేరాడు. వారిని పాండవులపైకి ఉసిగొల్పాడు. తనచేతికి మట్టి అంటకుండా తన శత్రువులైన కౌరవుల్ని పాండవుల చేతనే కడతేర్చి, తన పంతం నెగ్గించుకుని, తండ్రి, సోదరుల ఆత్మకు శాంతి కలిగించాడు. అట్లే పాండవ పక్షపాతియైన శల్యుడు కౌరవపక్షం చేరినా- కర్ణుడికి సారథ్యం వహించి, అతన్ని శక్తి విహీనుణ్ణి చేసి విజయుడికి జయం తెచ్చిపెట్టలేదా?'' అంటూ ఎగతాళిగా పిల్లి నాయుడి వంక తిరిగి మాట్లాడాడు యువనాయకుడు. సభలో గందరగోళం చెలరేగింది. ''సద్దు.. సద్దు..'' అంటూ సభా కార్యదర్శి అందరిని సముదాయించాడు.

''అవునవును మాకా పుక్కిటిపురాణాలు తెలీవులెండి...మీరే చెప్పండి..'' అంటూ మరో ప్రతిపక్ష నేత పిల్లిశేఖర్ అన్నాడు ఎగతాళిగా.

''అయితే వినండి. ఎలుకలు మన పోరాటానికి సహకరించే పక్షంలో మనం వాటికి కొన్ని హామీలు ఇవ్వాల్సివుంటుంది. వాటిని గూర్చి మనం ముందుగా చర్చించుకోవాల్సివుంటుంది. మనం వాటికి ఇచ్చే హామీలమీదే ఎలుకలు మన పక్షంగా పనిచేస్తాయి. ఆ హామీలకు మనం ముందు కట్టుబడి వుండాలి'' అన్నాడు యువనేత బల్లగుద్దుతూ.

''అవేవో చెప్పవయ్యా! పిల్లిమొగ్గలువేయకుండా..తరువాత ఆలోచిద్దాంగాని'' అన్నాడు మరొక ప్రతిపక్ష నాయకుడు పిల్లి రాములు.

''చెబుతున్నా! ముందు మనం వాటిని భక్షించకుండా వుండాలి. మన నుంచి వాటికి ఏలాంటి ప్రాణభయం వుండకూడదు. అవి మన ఆహారమని ఎప్పుడూ భావించకూడదు. మనుషులు మనకెంతగా పాలుపోసి వాటిని చంపడం కోసం పెంచినా చూసి చూడనట్లు పోవాలి. వాటికి స్వేచ్ఛనిస్తే చాలు అవి మానవులకు నష్టం కలిగిస్తే తప్ప వాళ్లకు బుద్ధిరాదు. వాళ్లు మనల్ని గౌరవించరు. దాంతో వాళ్ల పొగరు అణుగుతుంది. మన పంతం నెగ్గుతుంది, మన జాతికి గౌరవం లభిస్తుంది'' అని

## రచయిత పరిచయం



**స్వస్థలం:** హిందూపురం, అనంతపురం జిల్లా. 1969 నుంచి 2004 వరకూ హిందూ పురంలో ఉపాధ్యాయుడిగా, ఆ తదుపరి ప్రధానోపాధ్యాయుడిగా పదవీ విరమణ చేశాను. చదువుకునే రోజులనుంచీ రచనా వ్యాసంగం ఆరంభమైంది. బాలసాహిత్యంపై ప్రత్యేక కృషి. చాలా కథలు వివిధ పత్రికల్లో ప్రచురించబడ్డాయి. గేయాలు, వ్యాసాలు ప్రాచుర్యం పొందాయి. మా నాన్నగారు కవి కావడంతో ఆయన ప్రోత్సాహంతో నాప్రతిభకు పదును పెట్టుకున్నాను. సి.పి.బ్రౌన్ అకాడమీ-నవ్య వీక్లీ కథల పోటీలో నాకథకు బహుమతి అందించినందుకు ధన్యవాదాలు.

-కల్లూరి రాఘవేంద్రరావు

ఇంకా ఆ యువనాయకుడు ప్రసంగిస్తుంటే చప్పట్లు మారు మోగాయి.

ఇంతలో ఓ వృద్ధమార్జాలం చేతికర్ర ఆధారంగా లేస్తూ, ''అయ్యా! యువనాయకా! 'పిల్లికి గంట కట్టేదెవరు?అనే సామెతలా వుంది మన వ్యవహారం. ఆ ఎలుకతో మాట్లాడేదెవరు, ఒప్పించేదెవరు? అవి నాలాంటి ముసలి పీనుగుకు కూడా భయపడిచస్తాయే.. ఇక అవి మన మాటల్ని నమ్ముతాయా? సహకరిస్తాయా? ఒకవేళ అవి సహకరించడానికి ఒప్పుకున్నా..కొన్నేండ్లపాటు తినకుండా ఉండడం ఎలా? అంతవరకు కడుపులు మాడ్చుకోవాల్సిందేనా? పోనీ పాలు, పెరుగు, సమృద్ధిగా దొరుకుతున్నాయా అంటే అవి కూడా పూజ్యమైపోయాయి కదా! మరి, ఈ సమస్య ఎలా తీరుస్తారో మీరే చెప్పండి. మాకేమాత్రం అర్థం కావడం లేదు..'' తన సందేహాన్ని వెళ్లగక్కింది.

ఆ మాటలు విన్న ఇతర పిల్లులు కూడా ఆశ్చర్యపోయాయి. 'ముసలి పిల్లి చెప్పినది కూడా ఓ పెద్ద సమస్యే. దీన్ని యువకుడెలా తీరుస్తాడో చూద్దాం' అంటూ అతని జవాబుకోసం ఎదురు చూస్తూ వుండిపోయారు. ఇంతలో యువనాయకుడు లేచి,'' మీ అనుమానం నాకర్థమైంది. ఇపుడే ఆ సమస్యను పరిష్కరిస్తాను. దేశంలో ఇప్పుడు ఎవరి చేతుల్లో చూసిన సెల్‌ఫోన్లున్నాయి కదా! మనం ఎలుకల నాయకుడితో మాట్లాడితే సరి. ప్రత్యక్షంగా కలవాల్సిన అవసరం లేదుకదా!

ఇక రెండో విషయం. మనకు రాబోయే ఆహార సమస్య. ఇంతకుముందే మీకు మహాభారతంలో శకుని కథ చెప్పానుగా! అందులో శకుని సహోదరులు ఏం చేశారు. వారికేసిన పిడికెడు అన్నాన్ని శకునికిచ్చి, వాని చేత కార్యసాధన చేయించలేదా? అట్లే మనం కూడ మనకు దొరికిన ఆహారాన్ని నలుగురూ పంచుకుని కొన్నాళ్లు తినాలి. మనజాతిని నిలబెట్టుకోవాలి. మానవజాతిని తుదముట్టించాలి. ఇదే మన కృతనిశ్చయం..'' అని నాయకుడు చేయి పైకెత్తి చాటాడు. అందరూ అందుకు సమాధానంగా 'సెహభాష్' అంటూ చప్పట్లు చరిచారు. వెంటనే నాయకుడు ''ఈ విషయాన్ని దేశవ్యాప్తంగా ప్రచారం చేయడానికి మనకు 'అఖిల భారత అఖుభుక్కు సంఘం' ఉండనేవుంది'' అంటూ ఈ సభ తీర్మానాన్ని 'ఆల్ ఇండియా క్యాట్స్ ఫెడరేషన్' (ఏ ఐ సియఫ్) ప్రెసిడెంట్ గారికి ఫోను ద్వారా మెసేజ్ పంపుతూ, వివరాలు ఇ-మెయిల్ ద్వారా అందుకోమన్నాడు బిడాలమయ్య.

భారతదేశంలోని అన్ని ఎఐసియఫ్ సంఘాలతో, ఆల్ ఇండియా ర్యాట్స్ ఫెడరేషన్ (ఏఆర్‌యఫ్) వారు ఒప్పందాలు కుదుర్చుకున్నారు, కొన్ని షరతులతో- దేశంలో ఏ మూలైనా సరే, ఏ చిన్న ఎలుకపిల్ల కూడ పిల్లిచేతిలో చావకూడదు. ఈ ఏడాది ఆగష్టు15 అర్థరాత్రి నుండే ఈ షరతు అమలుచేయాలి.

ఈ ఒప్పందంతో తమకు పిల్లులనుండి ప్రాణహాని తప్పినందుకు, స్వేచ్ఛగా తిని, తిరగడానికి, విధ్వంసానికి మంచి అవకాశం చిక్కినందుకు ఎలుకలు చాలా సంతోషించాయి.

ఆగష్టు15 రానే వచ్చింది. ఆ అర్థరాత్రే ఎలుకలు దేశంలో విజృంభించాయి. బడిపిల్లల కోసం తెచ్చి పెట్టిన మిఠాయిలన్నీ ఆ రాత్రికిరాత్రే తుక్కుతుక్కుగా చేసేశాయి. కొత్త బట్టల్ని కొరికి పెట్టేశాయి. ఆహారపదార్థాలను చెల్లాచెదురు చేశాయి. ప్రభుత్వ గిడ్డంగుల్లోని ధాన్యాన్ని లూటీ చేశాయి. దేశంలో ఎక్కడ చూసినా ఎలుకలే. అవి చీమల్లా బారులు తీరి నడుస్తున్నాయి. దేశంలో కలరా, ప్లేగు, మశూచి, డెంగ్యూ వ్యాధులు వాటి ద్వారా వ్యాపించాయి. వాటిని పట్టుకోవడం మానవులకో పెద్ద సమస్యగా మారింది.

బోనుల్లో పడ్డా బోన్లను తెంచుకుని బయటికి వచ్చేస్తున్నాయి. అందరి ఇళ్లు దోచేస్తున్నాయి. మానవులు పెంచిన పిల్లులు ఎలుకల్ని చంపడం లేదు. అవి చూసి చూడనట్లుపోతున్నాయి. ఇది అందరికి చాలా వింతగా కనిపించింది. భారత దేశంలోని పత్రికలు, రేడియోలు, టీవీలు ఈ విషయాన్నే ప్రస్తావించాయి.

పల్లెల్లో వుండే చిన్న పెద్ద ఎలుకలన్నీ బడా బడా ఎలుకలుగా మారిపోయాయి. అవి పంటల్నే కాదు, పంట భూముల్ని, పెద్ద పెద్ద భవంతుల్ని ఆక్రమించుకున్నాయి. ప్రభుత్వ ఉద్యోగుల ఫైళ్లలో దూరి వాళ్లను జైలుపాలు చేశాయి. అవి ప్రభుత్వాన్ని ఏలడానికే సిద్ధమయ్యాయి. ప్రభుత్వం వాటి వశమైపోయింది. దేశంలో పాలన ఎలుక కొట్టిన పంచగుడ్డలా తయారైంది. అవి ప్రజాపాలకులనే బిరుదును సంపాదించుకున్నాయి.

పూరి గుడిసెలో వాసమున్న నిరుపేద రామయ్య భూమిని ప్రజాపాలక ఎలుకలు తినేశాయి. రామయ్యకు ఉరితాడే మిగిలింది. దాంతో భారతంలో మార్జాల పర్వం ముగిసి, పందికొక్కుల పర్వం ప్రారంభమైంది.

★

